MARKING SCHEME – TERM-2

CLASS - X: 2021-22

**089 – TELUGU TELANGANA**

MAX MARKS - 40 TIME: **2HRS**

## 10వ తరగతి - ద్వితీయ భాష - తెలుగు తెలంగాణ - ప్రశ్నపత్రము – మూల్యాంకన కరదీపిక

- **1. విభాగము – ఎ ( అవగాహన – ప్రతిస్పందన) 6మా**
- **2. విభాగము – బి (స్వీయరచన) 4మా**
- **3. విభాగము – సి (వ్యాకరణము) 10మా**
- **4. విభాగము – డి (సాహిత్యము) 20మా**

**మొత్తము: 40 మార్కులు**

1. **ఈ జవాబు పత్రము 4 (నాలుగు) ఎ,బి,సి,మరియు డి విభాగాలుగా విభజించబడింది.**
2. **అన్ని విభాగములు తప్పనిసరిగా రాయాలి.**
3. **ఒకటవ ప్రశ్న దగ్గర తప్ప, ప్రతి ప్రశ్న దగ్గర అంతర్గత ఐఛ్ఛికము ఇవ్వబడినది. ఐఛ్ఛికము నందు, నచ్చిన ప్రశ్నను ఎంపిక చేసుకోవచ్చు.**
4. **మొత్తము 12 ప్రధాన ప్రశ్నలు, 15 అంతర్గత ప్రశ్నలు ఇవ్వబడ్డాయి.**
5. **ప్రతి ప్రధాన ప్రశ్న దగ్గర ఇవ్వబడిన సూచనలను చదివి, అర్థం చేసుకొని విద్యార్థులచే రాయబడిన జవాబులను సరి చూచి తగిన మార్కులు ఇవ్వాలి.**
6. **అక్షర దోషాలు, భావ దోషాలు, వాక్యనిర్మాణం వంటివి దృష్టిలో ఉంచుకొని మూల్యాంకనం చేయాలి.**
7. **ఈ జవాబు పత్రంలో కేవలం జవాబులు మాత్రమే ఇవ్వబడ్డాయి.**

(మూల్యాంకనము నందు పాటించవలసిన సాధారణ సూచనలు, నియమాలు.)

- అక్షర దోషాలకు, వాక్య దోషాలకు, భావ దోషాలకు మార్కులు తీయబడతాయి. ఇవి ప్రధానంగా ప్రశ్న జవాబులు, ప్రక్రియలలో ఎక్కువ.
- ప్రతిపదార్థములు అన్నీ సరైన జవాబులైతేనే పూర్తి మార్కులు ఇవ్వాలి.
- సంక్షిప్త జవాబుల విషయంలో ఈ దోషాలు మొత్తంగా ½ మార్కుకు మించరాదు.

- ❖ వ్యాసరూప సమాధాన ప్రశ్నలలో దోషాలకు మొత్తంగా 1 మార్కు మించి తీయరాదు.
- ❖ అసలు జవాబు లేని చోట, తగిన జవాబు కానిచోట పూర్తి మార్కులు ఇవ్వాల్సిన పని లేదు.
- ❖ ప్రతి జవాబు దగ్గర దానికి సంబంధించిన మూల్యాంకన సూచనలు ఇవ్వబడ్డాయి.

## విభాగము – ఎ
## (అవగాహన – ప్రతిస్పందన)

**I. ఈ క్రింది గద్యాంశమును చదివి, దాని ఆధారంగా క్రింద ఇచ్చిన ప్రశ్నలకు తగిన జవాబులను ఒకటి లేదా రెండు వాక్యాలలో జవాబు పత్రంలో రాయాలి. 3X2 = 06మా**

1. ఇరుగు పొరుగు ప్రపంచంతో సంబంధాల్ని సుసంపన్నం చేసుకోవడం, స్నేహహస్తం అందుకోవడం
2. సైనిక కార్యకలాపాల విస్తరణతో పాటు ఆర్థిక సంబంధాల్ని మెరుగు పరచు కోవడం - హిందూ మహాసముద్ర ప్రాంతంలో
3. సముద్ర జలాల భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో సహకారం

(ప్రతి జవాబులోనూ రెండేసి భాగాలున్నాయి. ఒకటి రాస్తే 1 మార్కు ఇవ్వవచ్చు.)

## విభాగము – బి
## (స్వీయరచన)

**II. ఈక్రింద ఇవ్వబడిన మూడు ప్రక్రియలలో ఒకదానికి జవాబు రాయాలి. 1X4 = 04**

**అ) దినచర్య**

తేదీ రాసినందుకు ½ మా
సమయం రాసినందుకు ½ మా
విషయ విస్తరణ, సరళమైన భాష, విరామచిహ్నాలు, వాక్యాలకూర్పు అంశానికి తగిన భావ ప్రకటనకు 3మా
**మొత్తం 4మా**

28.10.2021,
రాత్రి 09.30 గం.

ఏమిటో ఈ ఎన్నికలు..ఎన్నికల ప్రచారం కోసం సామాన్య ప్రజలను ఎందుకు ఇబ్బంది పెడతారో ఈ నాయకులు..

ఈ రోజు సాయంత్రం బడి నుండి ఇంటికి వస్తూ ఉంటే దారిలో ఎన్నికల ప్రచారం కోసం అని ట్రాఫిక్ ను ఎక్కడికక్కడ నిలిపివేసారు. స్కూల్ బస్సులో వస్తూన్న నేను ఆ ట్రాఫిక్ జామ్ లో ఇరుక్కుపోయాను. ఎన్నికల వేళ నాయకులు అందరికీ ప్రజలు, వారు వేసే ఓట్లు కావాలి. కానీ ఆ ప్రజల పాట్లు మాత్రం వారికి పట్టదు.

ఇలా జన సమ్మర్దం ఎక్కువగా ఉండే వేళల్లో ప్రముఖ నాయకులు ఎన్నికల ప్రచారం కోసం అని, రోడ్లపై సభలు, సమావేశాలు నిర్వహిస్తే సామాన్య ప్రజలు పడే ఇబ్బందులు ఎన్నో.. స్కూళ్ళనుండి ఇంటికి వెళ్ళే నా లాంటి విద్యార్థులు, ఆఫీసుల నుండి వచ్చే ఉద్యోగులు, కార్మికులు ఇలా ఒకరేమిటి అందరికీ ఇబ్బందే. ట్రాఫిక్ జామ్ వల్ల రోడ్లపై ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంది.

ట్రాఫిక్ జామ్ లో ఇరుక్కుని ఆలస్యమవడం వల్ల, ముందుగా నిర్ణయించుకున్న ఎన్నో పనులు నిలచిపోతాయి. ట్యూషన్స్ కి, ఇతర ప్రధానమైన పనులకీ ఆటంకం ఏర్పడుతుంది. ఆలస్యమయ్యేకొద్దీ ఇంట్లో వాళ్ళు కంగారు పడతారు. తీరా ఇంటికి వెళ్ళేసరికి అలసట, చిరాకు కలుగుతుంది. దానివల్ల వేర్వేరు ఇబ్బందులు, అనారోగ్యాలు.

ఇలా జరగకుండా ఉండాలంటే పోలీసువారు ఎన్నికల ప్రచారం నిర్వహించే నాయకులకు రోడ్లపై ప్రచారం చేసేటందుకు అనుమతులు ఇవ్వకూడదు. ఖాళీ సమయాల్లో విశాల మైదానాల్లో మాత్రమే ప్రచారం చేసుకోమని చెప్పాలి. సామాన్య ప్రజలను కష్టాలకు గురిచేయకుండా చూడాలి.

అప్పుడే ప్రజలకు నాయకులపై నమ్మకం పెరుగుతుంది.

--సాకేత్.

**<u>ఆ) వార్తా నివేదిక</u>**

| | |
|---|---|
| ఊరు పేరు, తేదీ రాసినందుకు | <u>½ మా</u> |
| శీర్షిక రాసినందుకు | <u>½ మా</u> |
| విషయానికి, వ్యక్తీకరణకు | <u>3మా</u> |
| **మొత్తం** | **4మా** |

(ఇచ్చిన అన్ని ఆధారాలను ఖచ్చితంగా ఉపయోగించాలి.)

<u>రైతుల కన్నీరు!</u>

మహబూబునగర్, ఫిబ్రవరి 10. స్థానిక రైతు సంఘం భవనంలో జిల్లా రైతుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతులు ఎదుర్కొనే సమస్యల గురించి విస్తృతమైన చర్చ జరిగింది. నేటి కాలంలో రైతులు అనేకమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు, లేదా అతివృష్టి వంటివి రైతులను తీవ్రంగా బాధపెడుతున్నాయి. ప్రభుత్వం కూడా చెరువుల పూడికతీత వంటివి చేయట్లేదు. అంతేగాక సకాలంలో రైతులకు మంచి విత్తనాలు అందించడం, పంటలకు నీటి సరఫరా సౌకర్యాలు కలిగించడంలో ప్రభుత్వం విఫలమైంది. స్వయంగా కలెక్టర్ హామీ ఇచ్చినప్పటికీ అది సకాలంలో నెరవేర్చలేక పోయారు.

దీనివల్ల పంటలు పండక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. రైతుల ఆత్మహత్యలు చూసి, ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తమకు తగిన సౌకర్యాలు కల్పించాలనీ, రైతు కుటుంబాలను ఆదుకోవాలనీ రైతులు కోరుకుంటున్నారు.

రైతు నాయకులు అందరూ కలసి, ఈ విషయాలపై ఒక వినతి పత్రాన్ని ప్రభుత్వానికి అందించాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

("నమస్తే తెలంగాణా" దినపత్రిక)

--రోహన్,<br>
10వ తరగతి,<br>
ప్రభుత్వ పాఠశాల,<br>
మహబూబు నగర్.

**ఇ) <u>లేఖారచన</u>**

| | |
|---|---|
| తేదీ, స్థలం రాసినందుకు | <u>½ మా</u> |
| సంబోధన రాసినందుకు | <u>½ మా</u> |
| విషయ విస్తరణ, సరళమైన భాష, విరామచిహ్నాలు, వాక్యాలకూర్పు | |
| అంశానికి తగిన భావ ప్రకటన | <u>2 మా</u> |
| రాసిన వారి చిరునామా రాసినందుకు | <u>½ మా</u> |
| కవరుపై చిరునామా రాసినందుకు | <u>½ మా</u> |
| **మొత్తం** | **4మా** |

24.02.2021,
హన్మకొండ.

శ్రీయుత
అధ్యక్షులు గారికి,
హన్మకొండ పురపాలక సంఘం,
హన్మకొండ...

విషయము: మంచినీటి కొరతను నివారించి ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని కలిగించమని అభ్యర్థించుటను గూర్చి....

ఆర్యా!

నమస్కారములు. నా పేరు శ్రీనివాస్. మీ పురపాలక సంఘ పరిధిలోని గాంధీనగర్ లో నివసిస్తున్నాను. మా కాలనీలో గత 25 రోజులుగా మంచినీటికి కొరతగా ఉన్నది.

వేసవి కాలం రాబోతున్నది. ఈ కొరత ఇలాగే కొనసాగితే ప్రజలు మంచినీరు లేక అల్లల్లాడిపోతారు. సంబంధిత అధికారులను అడిగితే సరియైన జవాబు ఇవ్వడం లేదు.

అంతే గాక మా కాలనీ పల్లపు ప్రాంతంలో ఉండడం వల్ల వర్షాకాలంలో వర్షపు నీళ్ళు, బురదతో కలిసి కుళాయిలలో వస్తాయి. ప్రధాన పైపు లైన్లు పగిలి పోయినప్పుడు మురికి నీరు, అప్పుడప్పుడు డ్రైనేజి నీళ్ళు కూడా పైపుల ద్వారా కుళాయిలలోకి వస్తాయి.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఏదో తాత్కాలికమైన ఉపచర్యలే కాని ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించుట లేదు.

మా కాలనీలో మొత్తం 2 వేల మంది జనాభా ఉంటారు. అందరూ మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలే. ప్రతిరోజూ డబ్బులు పెట్టి మంచినీళ్ళు కొనుక్కునే స్తోమత లేదు.

కావున మా యందు దయతో మా కాలనీకి త్వరలో మంచినీటి కొరతను తీర్చి మా దాహార్తిని తగ్గించమని కోరుతున్నాము.

నమస్కారములతో.....

ఇట్లు.
తమ విధేయులు,
కె.శ్రీనివాస్ మరియు
గాంధీనగర్ కాలనీ వాసులు,
హన్మకొండ పురపాలక సంఘం,
హన్మకొండ.

శ్రీయుత అధ్యక్షులు,
పురపాలక సంఘ కార్యాలయం,
హన్మకొండ,
వరంగల్ జిల్లా.

## <u>విభాగము – సి</u>
## <u>(వ్యాకరణము)</u>

**III. ఈ క్రింది వానిలో ఒక వాక్యం నుండి సరైన పర్యాయపదాలు గుర్తించి రాయండి.** **1X2 = 02**

1. బంగారం, కనకం, హేమం, పసిడి
2. పోరాటం, కదనం, సమరం, యుద్ధం

( ఈ జవాబుల్లో ఏ రెండు రాసినప్పటికీ పూర్తి మార్కులు ఇవ్వాలి.)

**IV. ఈ క్రింది వానిలో ఒక పద్యపాదానికి గురులఘువులు గుర్తించి, గణవిభజన చేసి ఆ పద్య నియమాలను మీ జవాబు పత్రంలో రాయండి.**

**1X2 = 02**

**U I I U I U I I I U I I U I I U I U IU**

1. రెండవ సాటి దైవమిక లేఁడనుచున్ గడకట్టి భేరికా

- ✓ ఈ పద్యపాదము ఉత్పలమాల ఛందస్సుకు చెందినది.
- ✓ ఉత్పలమాలలో (4) నాలుగు పాదములు ఉంటాయి.
- ✓ ప్రతిపాదము లోనూ 20 అక్షరాలు ఉంటాయి.
- ✓ ప్రతిపాదము లోనూ వరుసగా భ ర న భ భ ర వ అనే గణాలు ఉంటాయి.
- ✓ ప్రతిపాదము లోనూ 1నుండి 10వ అక్షరానికి యతి చెల్లుతుంది.
- ✓ ప్రాస నియమం ఉన్నది.

**I I U U I I U I U I I I U U U I U U I U**

2. అనిదం పూర్వ యశస్వి యాతడగు నన్నా! విశ్వనాథేశ్వరా!

- ✓ ఈ పద్యపాదము మత్తేభము ఛందస్సుకు చెందినది.
- ✓ మత్తేభము లో (4) నాలుగు పాదములు ఉంటాయి.
- ✓ ప్రతిపాదము లోనూ 20 అక్షరాలు ఉంటాయి.
- ✓ ప్రతిపాదము లోనూ వరుసగా స భ ర న మ య వ అనే గణాలు ఉంటాయి.
- ✓ ప్రతిపాదము లోనూ 1నుండి 14వ అక్షరానికి యతి చెల్లుతుంది.
- ✓ ప్రాస నియమం ఉన్నది.

(గురులఘువులు గుర్తించక పోయినా పట్టింపు లేదు. పద్య లక్షణాలలో ఒక్కొక్కదానికి ½ మార్కుచొప్పున ఇవ్వవచ్చు. అన్ని నియమాలు రాస్తే పూర్తి మార్కులు ఇవ్వాలి. అక్షర దోషాలు చూడనక్కర లేదు.)

**V. ఈ క్రింది సమాసములలో ఒక దానిని స్వీకరించి అడిగిన విధంగా జవాబును మీ జవాబు పత్రంలో రాయండి.** **1X2 = 02**

1. శక్తియుక్తులు - ద్వంద్వ సమాసము
   లక్షణము: ఉభయ పదార్థ ప్రాధాన్యము ద్వంద్వ సమాసము.

2. నాలుగు ముఖములు కలవాడు - సమాస పదము: చతుర్ముఖుడు
   లక్షణము: అన్య పదార్థ ప్రాధాన్యము బహుప్రీహి సమాసము.

(ప్రతి జవాబులోనూ రెండేసి భాగాలున్నాయి. <u>ఒకటి రాస్తే 1 మార్కు</u> ఇవ్వవచ్చు.)

**VI. ఈ క్రింది జాతీయాలలో ఒక దానికి అర్థం రాసి స్వంతవాక్యంలో ప్రయోగించండి .** **1X2 = 02**

1. పీడవదలడం - అర్థము: నశించుట, నిర్మూలనం
వాక్య ప్రయోగం - మన దేశంలో శాంతి నిలబడాలంటే తీవ్రవాదుల <u>పీడవదలడం</u> అత్యవసరం.

2. ప్రాణం పోయు – అర్థము: బ్రతికించు, జీవమిచ్చు
వాక్య ప్రయోగం - కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా వైద్యులు చికిత్స చేసి రోగులకు <u>ప్రాణం పోస్తారు.</u>

**VII. ఈ క్రింది సామెతలలో ఒక దానికి అర్థం లేదా సందర్భాన్ని రాయండి.** **1X2 = 02**

**1.** ఉన్న ఊరు కన్నతల్లితో సమానం
కన్నతల్లి బిడ్డల అవసరాలు ఏవిధంగా తీరుస్తుందో తాము నివసిస్తున్న ఊరు కూడా ఆ విధంగా అన్ని అవసరాలు తీరుస్తుంది అని అర్థం..

(లేదా)

స్వంతూరును వదిలి పొరుగూర్లకు వలసలు పోతున్న వ్యక్తులను చూసినప్పుడు ఈ సామెతను వాడతారు.

**2.** ఎవరికివారే యమునా తీరే..
ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ప్రవర్తించడం..

(లేదా)

నలుగురు కూడినచోట ఒకే మాట, ఒకే పని కాకుండా ఎవరికి వాళ్ళు నచ్చినట్లు ప్రవర్తించే సందర్భంలో ఈ సామెత వాడతారు.

(జాతీయాలు, సామెతల విషయంలో విద్యార్థి స్వీయ స్వేచ్ఛకు అవకాశం ఇవ్వాలి. అడిగిన ప్రశ్నకు దగ్గరి అర్థాన్ని, వాక్య ప్రయోగాన్ని పరిశీలించి మార్కులు ఇవ్వాలి. భాషా అక్షర దోషాలు చూడ బడతాయి.)

## విభాగము – డి
## (సాహిత్యము)

**VIII. ఈ క్రింది ప్రశ్నలలో రెండింటికి 3, 4 వాక్యాలలోజవాబు రాయండి.**

**2X2 = 04**

(నాలుగు ఇవ్వబడ్డాయి. రెండు రాయాలి.)

క్రింద ఇవ్వబడినవి జవాబులలో తప్పనిసరిగా ఉండవలసిన ముఖ్యమైన విషయాలు. వీటిని ప్రధానంగా చేసుకొని విద్యార్థి రాసిన జవాబును దిద్దవలసి ఉంటుంది. రెండు మార్కులవి మరియు పాఠ్యాంశ ప్రశ్నలు కాబట్టి, **కనీసం రెండు లేదా మూడు ముఖ్యమైన పాయింట్లు ఉండడం తప్పనిసరి.** సుమారు 60 పదాల్లో జవాబులు రాయాలి.

1. ఆజంఖాన్ ఒక ఇంజనీరు. అతడే గోలకొండ పట్టణ నిర్మాణ పథకపు రూపకర్త. ఇతడు పట్టణం యొక్క రూపురేఖలను తీర్చిదిద్దినాడు. విశాలమైన రహదార్లు, అందమైన భవనాలతో పట్టణానికి చక్కని రూపాన్ని, మూడు ప్రహారీలతో రక్షణ వ్యవస్థను కల్పించినాడు.

   ఉమ్రావులు, మంత్రులు, సైన్యాధ్యక్షులు, సామాన్య ప్రజల నివాసాలకు విశాలమైన వసతి సౌకర్యాలు కల్పించాడు. మిద్దెతోటలు, ఉద్యానాలతో నగరానికి చక్కని రూపసౌందర్యాలను అందించాడు. గోలకొండ దుర్గం మూడు కోటలు, ఏడుమైళ్ళ కైవారం 87 బురుజులుతో ఉంటుంది. పట్టణంలో నగీనాబాగ్, షాహిమహలు, దిల్ కుషా అనే రాజభవనాలు ఉండేవి. మిద్దె తోటలు, అందమైన ఉద్యాన వనాలు ఉండేవి.

2. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విని మూడుతరాల ప్రజల కన్నుల్లో నీళ్ళునిండాయి. ఆనందోద్వేగాలతో ప్రజలు చిందులు వేశారు. సంతోషంతో పాటు జరిగిన పోరాటాలు, త్యాగాలు కూడా కలగలిపి తెలంగాణా ప్రజల హృదయాలను ఆర్ద్రంగా మార్చాయి. అందుకే

తెలంగాణా రాష్ట్ర ఏర్పాటును జాతిచరిత్రలో అద్భుత ఘట్టంగా అనుకుంటున్నారు.

3. సంపాదకీయాలు ప్రజల భవిష్యత్తును, వర్తమానాన్ని ప్రభావితం చేసే అంశాలను, సంఘటనలను విశ్లేషించి పాఠకులకు అందించాలి. సంపాదకీయాలు తక్షణ సమస్యలను, సంఘటనలను తాజావార్తలను, సమకాలీన అంశాలను సూటిగా నిష్కర్షగా సాధికారికంగా వ్యాఖ్యానించాలి.
4. పట్టణాల్లో నేడు జనాభా పెరిగిపోతున్నది. దీని వల్ల నివాసిత ప్రాంతాలు తగ్గిపోతున్నాయి. ఆహారం, నీరు సరిపడా దొరకడం లేదు. విద్యావైద్య రవాణా సౌకర్యాలు కల్పించడం కష్టమవుతున్నది. కాలుష్యం వల్ల నగర వాసులకు మంచిగాలి, నీరు, ఎండ లభించుట లేదు. వర్షాలు పడితే నాలాలు, మురుగు కాల్వలు నిండి రోడ్లపైకి నీరు ప్రవహిస్తుంది. దీనివల్ల అనేక అనారోగ్యాలు వస్తున్నాయి.

(జవాబులలో ఇవికాక అదనపు సమాచారం రాసినా, సరిచూచి మార్కులు ఇవ్వాలి)

## IX. ఈ క్రింది ప్రశ్నలలో ఒకదానికి సమగ్రమైన జవాబు రాయండి.

**1X4 = 04**

( క్రింద ఇవ్వబడినవి జవాబులలో తప్పనిసరిగా ఉండవలసిన ముఖ్యమైన విషయాలు. వీటిని ప్రధానంగా చేసుకుని విద్యార్థి రాసిన జవాబును దిద్దవలసి ఉంటుంది. నాలుగు మార్కులవి మరియు పాఠ్యాంశ ప్రశ్నలు కాబట్టి, **<u>కనీసం నాలుగు లేదా ఐదు ముఖ్యమైన పాయింట్లు ఉండడం తప్పనిసరి.</u>** సుమారు 100 పదాల్లో జవాబులు రాయాలి.)

1. పత్రికా హృదయమే సంపాదకీయం అని కొందరి అభిప్రాయం. ప్రజలకు వారి అభిప్రాయాలను వ్యాఖ్యానించి చూపి, నిర్మాణాత్మక మార్గనిర్దేశనం చేయడానికి, సమస్యలపై స్పందింపజేయడానికి సంపాదకీయాలు రాస్తారు. తాజా వార్తలపై, సంఘటనలపై పరిశోధనా పూర్వకమైన ఆలోచనల సమాహారమే సంపాదకీయం. చక్కని ప్రారంభం, ఆసక్తిని కలిగించే వివరణ, ఆలోచనాత్మక ముగింపు సంపాదకీయాల్లో ఉంటాయి. ఇవి సమాజ చైతన్యానికి తోడ్పడతాయి.

2. గోలకొండ రాజులలో ఇబ్రహీం కుతుబ్షా మంచి విద్యా ప్రియుడు. ఇతడు బాల్యంలో విజయనగర రాజు ఆదరణలో పెరగడంవల్ల తెలుగు భాషపై

అభిమానం కలిగి ఉండేవాడు. ఇతని ఆస్థానంలో కవులు, పండితులు ఉండేవారు.

ఇబ్రహీం కుతుబ్షా అద్దంకి గంగాధర కవి రచించిన "తపతీ సంవరణోపాఖ్యానం" అనే కావ్యాన్ని అంకితం తీసుకున్నాడు. మరింగంటి సింగరాచార్య కవిని గొప్పగా సత్కరించాడు. ఇతని సేనాని అమీరుఖాను పొన్నగంటి తెలగన రాసిన "యయాతి చరిత్ర" అనే అచ్చతెలుగు కావ్యాన్ని అంకితం తీసుకున్నాడు.

అబ్దుల్లా పాదుషా విజ్ఞానశాస్త్రము, లలితకళలు, వాఙ్మయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించాడు. ఈ విషయాలను బట్టి గోలకొండ పాదుషాలు సాహిత్య పోషకులు అని చెప్పవచ్చు.

(జవాబులలో ఇవికాక అదనపు సమాచారం రాసినా, సరిచూచి మార్కులు ఇవ్వాలి)

**X. ఈ క్రింది పద్యాలలో ఒక దానికి అన్వయ క్రమంలో ప్రతి పదార్థాలు రాయండి.** **1X4 = 04**

(రెండు ఇవ్వబడ్డాయి. ఒకటి రాయాలి.)

1. ఊరూరం జనులెల్ల ....................శ్రీకాళహస్తీశ్వరా !

| | | |
|---|---|---|
| 1. | శ్రీకాళహస్తి + ఈశ్వరా ! | =శ్రీకాళహస్తి క్షేత్రంలో వెలసిన ఓ ఈశ్వరా! |
| 2. | ఊరు + ఊరన్ | = ప్రతి గ్రామంలోను |
| 3. | జనులు + ఎల్లన్ | = ప్రజలందరూ |
| 4. | భిక్షము+ ఇడరు+ ఓ | = అడిగితే భిక్షము పెట్టరా? |
| 5. | ఉండన్ | = నివసించడానికి |
| 6. | గుహల్ | = కొండగుహలు |
| 7. | కల్గవు + ఓ | = లేకున్నవా? |
| 8. | చీర + అనీకము | = అసంఖ్యాక మైన చీరలు |
| 9. | వీధులన్ | = రాచవీధులలో (అంగడిలో) |
| 10. | దొరకదు + ఓ | = దొరకకపోదు కదా! |
| 11. | శీత | = చల్లనైన |
| 12. | అమృత | = తియ్యనైన (అమృతంవంటి) |
| 13. | స్వచ్ఛ | = నిర్మలమైన (స్వచ్ఛమైన) |
| 14. | వాః పూరంబులు | = నీటి ప్రవాహములు |

15. ఏఱులన్ =సెలయేళ్ళలో, ఏరులలో
16. పాఱదు + ఓ = ప్రవహించుట లేదా?
17. తపసులన్ = తపస్సుచేసికొనే మునులను
18. ప్రోవంగన్ = రక్షించడానికి
19. నీవు = నీవు
20. ఒపవు + ఓ = సిద్ధంగా లేవా?
21. జనుల్ = ప్రజలందరూ
22. రాజులన్ = రాజులను
23. చేరన్ = ఆశ్రయించడానికి
24. పోవుదురు + ఏల = ఎందుకు వెడతారో కదా!

2. వేద పురాణ ..........................ఘల్లనన్ !

1. వేద = వేదములయందు
2. పురాణ = పురాణములయందు
3. శాస్త్ర = శాస్త్రములయందు చెప్పబడిన
4. పదవీ = మార్గమునకు
5. న + దవీయసీ +ఐన = మిక్కిలి దూరముగా లేని
(మిక్కిలి దగ్గరగా ఉన్న)
6. పెద్ద ముత్తైదువ = ముసలి వయస్సులోని స్త్రీ (పురంధ్రి)
7. కాశికా నగర = కాశీ నగరము అనెడి
8. హాటక పీఠ = బంగారు పీఠము యొక్క
9. శిఖా = శిఖరమునందు
10. అధిరూఢ = అధిరోహించి యున్న
11. ఆ + ఆదిమశక్తి = ఆ ఆదిశక్తి స్వరూపిణి (పార్వతీ దేవి)
12. హస్త సంజ్ఞ = చేతి సైగల ద్వారా తెలుపబడుతున్న
13. ఆదర = ఆదరముతో కూడిన
14. లీలన్ = విలాసముతో (ఠీవిగా)
15. రత్న = రత్నములతో
16. ఖచిత = పొదగబడిన
17. ఆభరణంబులు = ఆభరణాలు (నగలు)
18. ఘల్లు ఘల్లు + అనన్ = గల్లు గల్లుమని చప్పుడుచేస్తూ ఉండగా
19. సంయమివరా = ఓ మునీశ్వరా
20. ఇటు రమ్ము + అని = ఇటువైపు రమ్మని
21. పిలెచెన్ = పిలిచింది

(తాత్పర్యములు రాయనక్కర లేదు. అన్వయక్రమము పాటించినందుకు ½ మార్కు. సంధి విసంధులు పాటించినందుకు ½ మార్కు, వీటికి 1 మార్కు కేటాయించబడినవి. దాదాపుగా పద్యానికి 20 నుండి 24 పదాలు ఉంటాయి. సుమారు పదానికి 1/8 మార్కు చొప్పున 3 మార్కులు ప్రతిపదార్థానికి కేటాయించాలి. మొత్తం 4 మార్కులు)

## XI. ఈ క్రింది ప్రశ్నలలో ఒకదానికి సమగ్రమైన జవాబు రాయండి.

**1X4 = 04**

(క్రింద ఇవ్వబడినవి జవాబులలో తప్పనిసరిగా ఉండవలసిన ముఖ్యమైన విషయాలు. వీటిని ప్రధానంగా చేసుకుని విద్యార్థి రాసిన జవాబును దిద్దవలసి ఉంటుంది. నాలుగు మార్కులవి మరియు పాఠ్యాంశ ప్రశ్నలు కాబట్టి, **కనీసం నాలుగు లేదా ఐదు ముఖ్యమైన పాయింట్లు ఉండడం తప్పనిసరి.** సుమారు 100 పదాల్లో జవాబులు రాయాలి.)

1. మనిషికి కోపం కలిగితే మంచిచెడ్డలను గ్రహించే విచక్షణను కోల్పోతాడు. రాక్షస ప్రవృత్తి పెరుగుతుంది.

1. కోపం వచ్చిన మనిషి పశువులా ప్రవర్తిస్తాడు. అవివేకంతో భార్యాపిల్లలను, తల్లిదండ్రులను కూడా బాధ పెడతాడు. కోపం శతృవు వంటిది. తనకోపమె తన శతృవు అని, సుమతీ శతకంలో కూడా చెప్పబడింది.
2. కోపం వల్లనే కన్నతల్లి వంటి కాశీ నగరాన్ని వ్యాసుడు శపించబోయాడు.
3. కోపాన్ని కలిగి ఉండడం వల్ల వ్యాసుడు, విశ్వామిత్రుడు, దూర్వాసుడు వంటి మహర్షులు ఎన్నో కష్టాలు పడ్డారు.
4. కోపం వల్ల జ్ఞానం నశించి, తమోగుణం పెరుగుతుంది. కోపం వల్ల మనిషి పాపపు పనులు చేస్తాడు. కోపం వల్ల మోహం పెరుగుతుందని గీతాకారుడు చెప్పాడు. కనుక అన్ని వేళలా కోపం వదిలి జీవించాలి.

2. శతక పద్యాలలో మనుషులు తమ జీవితంలో ఏ విధంగా నడచుకోవాలో తెలియజెప్పే నీతులు ఉంటాయి.

1. మిత్రుడి మంచి లక్షణాలు శతక పద్యాల ద్వారా తెలుసుకుని మంచి మిత్రులను సంపాదించు కోవచ్చు.
2. త్యాగ బుద్ధితో ప్రజల దైన్య స్థితిని పోగొట్టి దేశభక్తిని పెంచుకోవచ్చు.

3. భగవంతుని పూజకు సత్యం,దయ, ఏకాగ్రత అనే పుష్పాలు ముఖ్యమని శతక పద్యాల ద్వారా గ్రహించవచ్చు.
4. ధూర్జటి రాసిన పద్యం నుండి రాజాశ్రయం తీసుకోవడం అనవసరం అని గ్రహించి రాజకీయనాయకుల వెంట తిరగడం మాని స్వేచ్ఛగా బ్రతుకవచ్చు.
5. చదువుకున్నవారికి డబ్బు కంటే సత్యవాక్కు, గురుభక్తి, మంచితనము ముఖ్యమని గ్రహించవచ్చు.
6. కంచర్ల గోపన్న చెప్పినట్లుగా ఈ లోకంలో శ్రీరాముని మించిన దైవం లేడని తెలుసుకోవచ్చు.

**XII. ఈ క్రింది ఉపవాచక ప్రశ్నలలో ఒకదానికి సమగ్రమైన జవాబు రాయండి.** **1X4 = 04**

(మూడు ప్రశ్నలు ఇవ్వబడ్డాయి. ఒక ప్రశ్నకు సమగ్రమైన జవాబు రాయాలి. ఉపవాచక ప్రశ్నలు క్షుణ్ణ అధ్యయనం ద్వారా విద్యార్థులు రామాయణం నుండి నేర్చుకున్న విషయాలను సమగ్రంగా రాయాలి. ఇవి అనువర్తిత అంశాలకు చెందినవి కావున తదనుగుణమైన జవాబులు ఆశించడమైనది.)

1. రావణుడు ప్రయోగించిన శక్తి ఆయుధం లక్ష్మణుడి గుండెలకు గుచ్చుకుంది. లక్ష్మణుడు స్పృహ తప్పాడు. రాముడు హనుమంతుని భుజాలపై కూర్చొని రావణునితో యుద్ధం చేశాడు. రాముడు రావణునితో "యుద్ధం లో అలసిపోయావు. విశ్రాంతి తీసుకుని రా!.. నా బలం చూపిస్తాను". అన్నాడు.

   రాముడు కుంభకర్ణుని చంపాడు. లక్ష్మణుడు ఐంద్రాస్త్రంతో ఇంద్రజిత్తును చంపాడు. రావణుడు శక్తిని ప్రయోగించాడు. రాముని విలువిద్యకు నిలబడలేక పరుగులు తీశాడు రావణుడు.

   హనుమంతుడు ఓషధీ పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుణ్ణి బ్రతికించాడు. ఇంద్రుడు రామునకు దివ్య రథాన్ని పంపాడు. రాముడు ఆ రథం ఎక్కి రావణునితో యుద్ధం చేశాడు. క్రమంగా రాముని ముందు రావణుడు నిలబడ లేక పోయాడు. రావణుని సారథి రథాన్ని పక్కకు మళ్ళించాడు. రావణుడు తన సారథి పై కోపించాడు.

   అగస్త్య మహర్షి రామునికి ఆదిత్య హృదయం చెప్పాడు. రాముడు బాణాలు తగిలి రావణుని తలలు తెగి పడ్డాయి. కానీ తిరిగి మొలుస్తూ ఉన్నాయి. రామ రావణ యుద్ధానికి సాటి రామ రావణ యుద్ధమే. మాతలి బ్రహ్మాస్త్రాన్ని

ప్రయోగించాలని రామునికి సూచించాడు. రాముని బ్రహ్మాస్త్రంతో రావణుడు మరణించాడు.

2. హనుమంతుడు లంకలో అశోక వృక్షం కింద ఉన్న సీతమ్మకు రాముని గుణగణాలను వర్ణించి చెప్పాడు.
శ్రీరాముడు పద్మముల వంటి కన్నులు కలవాడు. చక్కని దేహ సౌందర్యం గుణసంపద కలవాడు. తేజస్సులో రాముడు సూర్యుడి వంటి వాడు. ఓర్పులో భూదేవి, బుద్ధిలో బృహస్పతి, కీర్తిలో దేవేంద్రుడు రామునితో సమానులు.
శరణన్న వారిని రక్షిస్తాడు. శత్రువులను సంహరిస్తాడు. రాముడు యజుర్వేదము, ధనుర్వేదము లలో పండితుడు. విశాలమైన భుజములు, పొడవైన చేతులు, శంఖం వంటి మెడ, శుభప్రదమైన ముఖము కలవాడు. రాముడు సకల ఐశ్వర్య సంపన్నుడు. శ్రీరాముడు సత్యము మాట్లాడుట యందు, ధర్మ ఆచరణ యందు ఆసక్తి కలవాడు. పాత్రులకు దానం చేస్తాడు. అందరితో ప్రియముగా మాట్లాడతాడు. శ్రీరాముడు మేఘము వలె శ్యామల వర్ణము కలవాడు. శ్రీరాముడు చంద్రునివలె చక్కని ముఖము గలవాడు. ధర్మ రక్షకుడు, అరివీర భయంకరుడు. అని హనుమంతుడు శ్రీరాముని గుణగణాలను సీతకు తెలియజెప్పాడు.

3. వాలి సుగ్రీవులు వానర వీరులు. వీరు అన్నదమ్ములు. తండ్రి తరువాత పెద్దవాడైన వాలి కిష్కింధ రాజ్యానికి రాజు అయ్యాడు. మాయావి అనే రాక్షసుడు వాలిని యుద్ధానికి పిలిచాడు. మాయావి వెంట వాలి సుగ్రీవులు వెళ్లారు. మాయావి ఒక గుహలో దూరాడు. వాలి, సుగ్రీవుని గుహద్వారం వద్ద కాపలా ఉంచి తాను లోపలికి వెళ్ళాడు.
సంవత్సరం తరువాత గుహలో నుండి రక్తము, నురుగ బయటకి వచ్చాయి. పెద్ద పెద్ద అరుపులు వినిపించాయి. మాయావి చేతిలో తన అన్న వాలి మరణించాడని అనుకుని సుగ్రీవుడు ఒక పెద్ద బండరాయిని ఆ గుహ ద్వారానికి అడ్డు పెట్టాడు. రాజ్యానికి తిరిగి వచ్చాడు.
మంత్రులు సుగ్రీవుడిని రాజుని చేశారు. ఆ తరువాత వాలి వచ్చి సుగ్రీవునిపై కోపించి సుగ్రీవుడిని తరిమికొట్టి, అతని భార్య రుమను అపహరించాడు.
సుగ్రీవుడు ఋష్యమూక పర్వతం మీద నివాసం ఉండటం ప్రారంభించాడు. మతంగ మహర్షి శాపం వల్ల వాలి అక్కడకు రాలేడు. హనుమంతుడు సుగ్రీవునకు మంత్రిగా ఉండి రామ,సుగ్రీవులకు మైత్రిని

కల్పించాడు. రాముడు వాలిని చంపి, సుగ్రీవుని కిష్కింధకు రాజును చేస్తానని మాట ఇచ్చాడు. రాముని సహాయంతో సుగ్రీవుడు తన అన్న అయిన వాలిని సంహరించి, కిష్కింధకు రాజు అయ్యాడు. తరువాతి కాలంలో తన వానర సైన్యాన్ని, సీతను వెదకడానికి, రామునికి సహాయంగా పంపించాడు.

***************************